
## మన అపురూప వారసత్వం



మైసూరు రాజప్రాసాదం

13

కర్నాటక రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన మైసూరులో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేది మైసూరు రాజప్రాసాదం. దాదాపు అయిదు శతాబ్దాల వంశపారంపర్య పరిపాలనా సంస్కృతీ సంప్రదాయాలను గుర్తుకు తెస్తూ, నాటి వైభవానికి చిహ్నంగా నేటికీ వెలుగొందుతున్న ఈ ప్రాసాదం తొలిసారిగా క్రీ. శ. 1630 లో నిర్మించబడినదని చరిత్ర చెబుతోంది. కాలగమనంలో ప్రకృతి వైపరీత్యానికి గురై శిథిలమైన ఈ రాజప్రాసాదాన్ని శ్రీ రణధీర కంఠీరవ నరసరాజ ఒడయార్ పునర్నిర్మించాడని చరిత్రకారులు చెబుతున్నారు. 1793 లో

టిప్పు సుల్తాను ఈ ప్రాసాదంలోని ఆలయాలను మినహాయించి తక్కిన పురాతన శిథిల కట్టడాలను తొలగించి నజర్‌బాద్ అనే నూతన నగరాన్ని నిర్మించాడు. 1799 లో యువరాజుని పట్టాభిషిక్తుణ్ణి చెయ్యడానికి సరియైన ప్రదేశము లభించక నజర్‌బాద్‌లోని ఒక పండాల్ (పందిరి) లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని 'డ్యూక్ ఆఫ్ విల్లింగ్‌టన్' పేర్కొన్నాడు. 1801 లో కలపతో నిర్మించబడిన భవనం 1897 లో యువరాణి జయలక్ష్మి అమ్మణ్ణి వివాహమహోత్సవ సందర్భంలో అగ్నికాహుతి అయిపోయింది.

పర్యాటకులను విశేషంగా ఆకర్షించే ప్రస్తుత మైసూర్ రాజప్రాసాదం నిర్మాణం 1897 లో ప్రారంభమై 1912 లో పూర్తిగావించబడింది. సిమ్లాలోని 'వైస్ రీగల్ లాడ్జ్' ను రూపొందించిన వాస్తుశిల్పి హెన్రీ ఇర్విన్ ప్రధాన వాస్తుశిల్పిగా ఈ ప్రాసాద నిర్మాణం జరిగింది.

ఈ మైసూరు రాజప్రాసాదం రెండు ప్రధాన భాగాలుగా నిర్మించబడింది. పశ్చిమార్థ భాగంలో శ్రీ శ్రీకంఠదత్త ఒడయార్ నివాసభవనం వున్నది. రాజకీయ సాంస్కృతికాది కార్యకలాపాలకై నిర్దేశింపబడిన మిగిలిన అర్థభాగంలో గొంబెతొట్టి, అంబవిలాస్, కల్యాణమండపం, దర్బారుహాలు వున్నాయి. ఈ భాగాన్ని కర్నాటక ప్రభుత్వం స్వాధీనపరచుకుని మ్యూజియంగా మార్చివేసింది. ఇండియన్ రిపబ్లిక్‌లో ఒక భాగంగా చేరడానికి మొదట ముందుకొచ్చిన రాజుల్లో తన తండ్రి శ్రీ జయచామరాజేంద్ర ఒడయార్ ఒకరైనప్పటికీ, మాటమాత్రంగానైనా తనను సంప్రదించకుండా ఈ ద్వితీయార్థ భాగాన్ని స్వాధీనపరచుకొని మ్యూజియంగా మార్చివేయడం అన్యాయమని శ్రీకంఠదత్త ఒడయార్ ప్రభుత్వంతో వివాదానికి దిగారు. ఈ వివాదం ఇంకనూ కొనసాగుతూనేవున్నది.

— 'మృగశిర'
(మ్యాస్ట్రెక్‌ల్)

## చిట్టి కథ

సాయంత్రం ఆరు దాటింది. ఆఫీసు నుండి బయటకు వచ్చింది సునీత. దిల్‌సుక్‌నగర్ వెళ్ళే బస్ కోసం ఎదురు చూస్తూ నించుంది.

పదిహేను నిముషాలు వెయిట్ చేసాక చాలా రష్‌గా వచ్చింది బస్సు. అందరి కంటే చివరిగా బస్సు ఎక్కుతుండగా, నలుగురైదుగురు జంట్స్ కూడా లేడీస్ వైపునుండే ఎక్కటానికి వచ్చారు. అప్పటికే మొదటి సీటు వరకు జంట్స్ నిల్చున్నారు. లోపలికి పోవడానికి ప్లేసు లేదు. ఇంక వీళ్ళకన్నా ముందు తనే లోపలికి వెళ్తే మధ్యలో ఇరుక్కోవలసి వస్తుందని డ్రైవరు క్యాబిన్‌లోనే మెట్లకి పైన మూలగా నించుంది సునీత.

బస్సు ఓ పది అడుగులు తీసుకెళ్ళి ఆపేసాడు డ్రైవరు, మగవాళ్ళంతా ముందే నించోవడంతో "వాళ్ళని వెళ్ళనీయండమ్మా! కొంచెం కూడా జరగకపోతే ఎలా?" అంటూ లేడీస్‌ని జరగమంటున్నాడు.

## 'మార్పు'

అంతటితో ఆపక "దారికడ్డంగా నిల్చుంటారు. మగవాళ్లకి దారి ఇవ్వకుండా" అంటూ ఆడవాళ్ళ మీద తనకున్న కోపాన్నంతా బయట పెడుతున్నాడు.

అతని దృష్టి సునీత మీద పడింది. "లోపలికి వెళ్ళు" అన్నాడు గౌరవం లేకుండా. "వీళ్ళని లోపలికి వెళ్ళనీ, వెళ్తాను" అన్నది తన ముందున్న జంట్స్‌ని చూపుతూ.

"వాళ్ళ సంగతి నీకెందుకు? నువ్వు లోపలికెళ్ళు" అన్నాడు. "వాళ్ళు అడ్డంగా ఉంటే నేను లోపలికెలా వెళ్తాను?" అంది కాస్త కోపంగానే.

"ఎలా వెళ్తావో నాకనవసరం. ఇక్కడ నిలబడకూడదు" అని కాస్త ఆగి "అయినా ఈ మధ్య ఫ్యాషన్ అయిపోయింది. స్టయిల్‌గా ఇక్కడ నిల్చోవటం" స్వగతమే కాని అందరికీ వినబడేలా గట్టిగా అంటున్నాడు.
మగవాళ్ళందరికీ చక్కటి పిక్చర్ దొరికింది.

సునీత ఇక కోపం పట్టలేక "ఏంటీ ఇందాకటి నుండి చూస్తున్నాను. వెళ్తానని చెప్పినా వినిపించుకోరేం? మాకేం కోరిక లేదు ఇక్కడ నిల్చోవాలని. బస్‌లో కూర్చోడానికి కాదు కదా, కనీసం నిల్చోడానికి కూడా ల్యేకుండా వాళ్ళు ఇక్కడి వరకూ వచ్చి నించుంటే మేమెక్కడికి పోవాలి? అది చాలదన్నట్లు, ఇంకా ముందు నుండి జంట్స్‌ని ఎందుకు ఎక్కనిస్తున్నారు? వాళ్లనీ ముందునుండి రానిస్తున్నది చాలక మేము ప్రక్కకు జరిగి పాపం వాళ్ళకి స్వాగతం పలకాలా? వాళ్ళని వెనక్కి జరగమని గట్టిగా అడిగే ధైర్యం లేదు కాని అడ్డమైన మాటలు పడడానికి మేము దొరికామా?" ఆవేశంతో మొహమంతా ఎర్రగా అయింది తనని తాను కంట్రోలు చేసుకుంటూ ఆగింది.

డ్రైవరుకే కాదు, అక్కడ ఎవరికీ ఏమనాలో



తోచలేదు. ఆడవాళ్ళు మాత్రం, అంత ధైర్యంగా మాట్లాడినందుకు మెచ్చుకోలుగా చూసారు.

వెనకాల టికెట్స్ ఇష్యూ చేసి అప్పుడే ముందు వైపు నుండి ఎక్కుతున్న కండక్టర్ సునీతని చూస్తూ "ఏమిటి మాట్లాడుతున్నావు? వెనకాల ఖాళీ. బస్సు వస్తుంది దిగు" అన్నాడు.

సునీత ఏదో అనబోయేంతలోనే "తనేమీ ఖాళీ బస్సు కావాలని అడగలేదు. నిల్చోడానికి ప్లేసు మాత్రమే అడిగింది" అంటూ సునీతకు సపోర్టు వచ్చారు ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు. ఇక కండక్టర్ ఏం మాట్లాడలేదు.

డ్రైవర్ బస్సు స్టార్ట్ చేసాడు. ఇంత గొడవ అయినా ఎక్కడి వాళ్ళు అక్కడే ఉన్నారు.

తన స్టాప్ రాగానే, డ్రైవరు తన వైపే చూస్తుండటాన్ని గమనిస్తూ దిగిపోయింది సునీత.

* * *

రెండు రోజుల తర్వాత స్టాప్‌లో వచ్చి ఆగిన బస్సు నంబరు చూసి ఎక్కేసింది. రెండు స్టాప్‌లు దాటాక ఇద్దరు జెంట్స్ ముందు వైపు నుండి ఎక్కటానికి ప్రయత్నించగానే డ్రైవరు బస్ ఆపేసాడు. సునీత డ్రైవరు వైపు చూసింది. అదే డ్రైవరు. "వెనకాలనుండి ఎక్కండి. ఖాళీగా ఉంటే అనుకో వచ్చు. ఇంత రష్‌లో కూడా మీరు ముందు నుండి వస్తే లేడీస్‌కి ఇబ్బంది కదా?" అంటూ వెనకవైపుకి వాళ్ళు వెళ్ళేవరకూ బస్‌ని అలాగే ఆపి ఉంచాడు.

వాళ్ళు వెళ్ళాక బస్సు స్టార్ట్ చేస్తూ సునీత వైపు చూసాడు. అభినందిస్తున్నట్లు నవ్వింది సునీత.

— బి.వసుంధర, హైద్రాబాదు

## నిబంధనలు

'వనిత' మాటల కొలువులో స్త్రీలు మాత్రమే పాల్గొనాలి. ఈ పేజీలో ఉన్న కూపను పూర్తి చేసి, కవర్లో, 'వనిత మాటల కొలువు - 186, చందమామ బిల్డింగ్స్, వడపళని మద్రాసు - 600 026' చిరునామాకు జూలై 28 లోగా చేరేలా పంపాలి. సమాధానాలు సెప్టెంబర్ (91) సంచికలో ప్రచురిస్తాము. గళ్లలో రాసే అక్షరాలు స్పష్టంగా తెలిసేలా ఉండాలి. కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు. దీని సమాధానంతో సరిపోయేసమాధానం పంపిన వారికి రూ. 200 లు బహుమతిగా పంపుతాము. సరైన సమాధానం రాసిన వారు ఒకరి కంటె ఎక్కువ మంది గనక ఉన్నట్లయితే, లాటరీ పద్ధతిలో బహుమతి మొత్తం నలుగురికి (ఒక్కొక్కరికి రూ. 50/- చొప్పున) సమానంగా పంచి అందజేస్తాము. ఈ విషయంలో తుది నిర్ణయం సంపాదకులదే.


### ఆధారాలు – అడ్డం

1. పొద్దున్న, రాత్రి – అన్ని వేళలా హరినామ జపం
4. —భామినీ, మాట వరసకెప్పుడైనా అలా చెప్పానా?
6. డబ్బు
7. వేదిక
8. శ్రమజీవుల కొంపలు కూల్చేది!
10. ఒయ్యారిభామకు ముందుమాట!
11. రామచిలుక వుండేది?
13. విలువైన పేకముక్క
14. కంఠధ్వని
16. —ఈ జీవితం, తిరిగే రంగులరాట్నం! ఇంతకన్నా ఏముంది?
17. రాగమొక రంభ అయితే యిది ఒక బానిస
18. మీకు అద్దంలో కనిపించేది!

### ఆధారాలు — నిలువు

2. సూర్యకిరణాల, సప్తవర్ణ సమాగమం
3. శాతవాహనుని పరిపాలన మొదలైన సంవత్సరం
4. కొలది అతి కొలది
5. ఇతని ప్రతి హరికథ సకల కళా సరస్వతి పరిషత్తే!
8. పలు రకాల కూరగాయలు ఒక దానిలో నింపితే, శీర్షిక పేరుకు పనికిరాదూ?
9. ప్రేమతత్త్వము
12. మర్రివృక్షం (కింద నుంచి పైకి చదివితే)
13. రాధ మీద ఒట్టేసి పూజించటం!
15. అగాధమైన జలనిధిలో దొరికేది.
16. ఇది కట్టిన గుడ్డ, బెల్లం వండిన పొయ్యి దాగుతాయా?

వనిత మాటల కొలువు-186 రూ 200 లు బహుమతి




పేరు ________________

చిరునామా ________________